సమావేశంలో మాట్లాడుతున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పక్కన మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

రైతు భరోసా కింద ఎకరాకు రూ.12వేలు

- 26 నుంచి రైతు ఖాతాలో జమ
- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి
- నల్లగొండలో మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డితో కలిసి పలు పథకాలపై సమీక్ష

నల్లగొండ, జనవరి 12: ఈ నెల 26 నుంచి రైతు భరోసా కింద ఎకరాకు రూ.12వేలు ఇవ్వనున్నట్లు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఉదయాదిత్య భవన్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలతో కలిసి పలు పథకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ సేద్యానికి యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇవ్వనున్నట్లు చెప్పారు. భూమి లేక పోయినా చాల మంది రైతులు పాస్‌పుస్తకాలు కలిగి ఉన్నారని, క్షేత్రస్థాయిలో అధికారులు విచారణ చేసి వాటిని తొలగించాలని సూచించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమిలేని పేదలకు రూ.12వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ అధికారులు జనవరి 16 నుంచి 20 వరకు క్షేత్రస్థాయి పర్యటనలు చేసి రికార్డులు పరిశీలించి 21 నుంచి 24 వరకు గ్రామసభలు నిర్వహించి భూమి లేని వారిని, భూసేకరణ చేసిన భూములను, గుట్టలు, లేఅవుట్‌లు, నాలా కన్వర్షన్ చేసిన భూములను గుర్తించి వారి పేర్లను రైతు భరోసా నుంచి తొలగించాలని ఆదేశించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏడాదికి 3500 ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గ్రామ సభల్లో గుర్తించి ఎంపిక చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు బాలూనాయక్, ఉత్తమ్ పద్మావతి, వేముల వీరేశం, మందుల సామేల్, జయవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, కలెక్టర్లు ఇలా త్రిపాఠి, హన్మంతరావు, తేజస్ నందలాల్ పవార్, సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ, ఉమ్మడి జిల్లాకు చెందిన ఆర్డీఓలు, తాసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

వివేకానందుడి బోధనలు అనుసరణీయం

- మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి
- జిల్లా వ్యాప్తంగా వివేకానంద జయంతి

రామగిరి, జనవరి12 : వివేకానందుడి బోధనలు నేటి సమాజానికి ముఖ్యంగా యువతకు అనుసరణీయమని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డులో ఉన్న వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత వివేకానందుడు చూపిన మార్గాన్ని అనుసరించి ఉత్తమ పౌరులుగా ఎదుగాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్, నాయకులు రావుల శ్రీనివాస్‌రెడ్డి, మిర్యాల యాదగిరి, మెరుగు గోపి, బొజ్జ వెంకన్న, దొడ్డి రమేశ్, సిరిగిరి సురేశ్‌రెడ్డి, పిన్నపురెడ్డి సైదిరెడ్డి, మామిడి సత్తయ్య, శ్రీపాద కృష్ణమాచారి, రాజిరెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

నల్లగొండలో వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల, బీఆర్‌ఎస్ నాయకులు

రామగిరి : తపస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్పీ రాములునాయక్ పాల్గొన్నారు. వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేశ్‌గౌడ్, తాసీల్దార్ శ్రీనివాస్, పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

మర్రిగూడ : స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యూత్ ఫర్ బెటర్ సొసైటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సీఐ నవీన్‌కుమార్ ప్రారంభించి రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ నల్ల యాదయ్య, మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య, కొల్కులపల్లి యాదయ్య, ఆర్గనైజర్లు వెంకటంపేట ఆంజనేయులు, పొనుగోటి దామోదర్‌రావు పాల్గొన్నారు.

వివేకానందుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్‌చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్పీ రాములునాయక్, నాయకులు

నకిరేకల్ : చందుపట్ల గ్రామంలో వివేకానందుడి జయంతిలో పాల్గొన్న వివేకానంద యువజన మండలి సభ్యులు


పీపపల్లి : వివేకానందుడి విగ్రహం వద్ద ప్రముఖుల నివాళి

మర్రిగూడ : రక్తదానం చేస్తున్న సీఐ నవీన్‌కుమార్, ఎస్‌ఐ కృష్ణారెడ్డి

రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు చిర్ర మల్లయ్యయాదవ్

నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మిర్యాలగూడ, జనవరి 12: రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, ప్రతిపక్ష నాయకులకు, పార్టీ కార్యాలయాలకు రక్షణ లేకుండా పోయిందని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకుడు చిర్ర మల్లయ్యయాదవ్ అన్నారు. ఆదివారం వేములపల్లి మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భువనగిరి జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంపై ఎన్‌ఎస్‌యూఐ, కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతగాక దీనిపై ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులపై, కార్యాలయాలపై దాడులు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి దైద జాన్సన్, పుట్టల సందీప్, మజ్జిగపు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పుట్టల పౌల్, నెమ్మాది రజనీకాంత్ పాల్గొన్నారు.

చిరుమర్తి అరెస్టు అప్రజాస్వామికం

చిట్యాల : బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో భువనగిరిలో శాంతియుతంగా నిర్వహించే నిరసన కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను పోలీసులు అరెస్టు చేయటం అప్రజాస్వామికమని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు జిట్ట శేఖర్ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఏడాది కాలంగా కాంగ్రెస్ నాయకుల దాడులు, దౌర్జన్యాలను ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని, ఇప్పుడు ఏకంగా పార్టీ కార్యాలయాలపైనే దాడులకు పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ యువజన విభాగం మండలాధ్యక్షుడు తుమ్మల నాగరాజురెడ్డి మాట్లాడుతూ భువనగిరిలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడి ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని, దాడులకు పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ గూండాల దాడి హేయం

మర్రిగూడ/చండూరు, జనవరి 12 : భువనగిరి పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ గుండాలు చేసిన దాడి హేయమైన చర్య అని మాజీ ఎంపీటీసీ ఊరిపక్క సరితానగేశ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేయడం చేతగాక, ప్రశ్నించిన వారిపై కాంగ్రెస్ పార్టీ దాడులకు పాల్పడుతుందని మండిపడ్డారు. అరెస్టులు, దాడులు బీఆర్‌ఎస్ పార్టీని భయపెట్టలేవని, ప్రజల తరపున ఉండి పోరాడుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ తీరు మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు

- ఐజీ సత్యనారాయణ

చిట్యాలలో ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న ఐజీ సత్యనారాయణ, పక్కన ఎస్పీ శరత్‌చంద్రపవార్, డీఎస్పీ శివరాంరెడ్డి

చిట్యాల, జనవరి 12 : సంక్రాంతి సందర్భంగా జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగిన దృష్ట్యా గత అనుభవాలను పరిగణలోకి తీసుకొని ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురు కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు రాష్ట్ర ఐజీ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణ కోసం చేసిన ఏర్పాట్లును, జాతీయ రహదారిపై వాహనాల రద్దీని పరిశీలించారు. చిట్యాలలో ఎస్పీ శరత్‌చంద్రపవార్, డీఎస్పీ శివరాంరెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జాతీయ రహదారిపై ట్రాఫిక్ అంతరాయం, ప్రమాదాలు జరుగకుండా నల్లగొండ, సూర్యాపేట ఎస్పీలు శరత్ చంద్రపవార్, సంత్‌బీర్ సింగ్, రాచకొండ కమిషనర్, యాదాద్రి డీసీపీ, ఎన్‌టీఆర్ జిల్లా పోలీసు అధికారుల సమన్వయంతో 550 మంది కానిస్టేబుళ్లు, 30 మంది ఎస్‌ఐలు, 15 మంది సీఐలు, ఇద్దరు డీఎస్పీలతో హైవే వెంట పటిష్ట పహారా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి రోజు 20 నుంచి 30 వేల వాహనాలు వెళ్లే జాతీయ రహదారిపై సంక్రాంతి సందర్భంగా ప్రస్తుతం రోజు లక్ష వాహనాలు వెళ్తున్నట్లు చెప్పారు. ఆంధ్రాకు వెళ్లే ప్రధాన రహదారులు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే ఎక్కువగా ఉన్నందున ఇక్కడ పకడ్బందీగా ఏర్పాట్లు చేశామన్నారు. పండుగ తర్వాత ప్రజలు ఆంధ్రా నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారని, అప్పుడు కూడా ఈ ఏర్పాట్లు కొనసాగుతాయన్నారు. ఆయన వెంట నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, చిట్యాల ఎస్‌ఐ ధర్మ ఉన్నారు.

నేటి పోలీస్ గ్రీవెన్స్ రద్దు

నీలగిరి, జనవరి 12 : సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే పోలీస్ గ్రీవెన్స్‌ను రద్దు చేసినట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు సంప్రదాయానికి ప్రతీక అయిన భోగి, సంక్రాంతి పండుగల నేపథ్యంలో గ్రీవెన్స్‌ను రద్దు చేసినందున ప్రజలు వినతులు అందించేందుకు ఎస్పీ కార్యాలయానికి రావద్దని సూచించారు. తదుపరి తేదీని జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రకటిస్తుందని తెలిపారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

చండూరు, జనవరి 12: మండలంలోని నేర్మట గ్రామ మాజీ సర్పంచ్ నారపాక శంకరయ్య తల్లి సరమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ఎంపీపీ తోకల వెంకన్న గ్రామానికి వెళ్లి సరమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మాజీ మండలాధ్యక్షుడు పెదగోని వెంకన్న, మాజీ ఎంపీటీసీ కావలి మంగమ్మాప్రసాద్, బుర్కాల శ్రీను, పనస లింగస్వామి, గాలెంక కృష్ణయ్య, స్వామి, ఎల్లయ్య ఉన్నారు.

ఎస్‌టీయూ డైరీ ఆవిష్కరణ

రామగిరి, జనవరి 12: ఎస్‌టీయూ టీఎస్ –2025 డైరీని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదివారం నల్లగొండలోని కలెక్టరేట్ ఆవరణలో ఆవిష్కరించారు. కార్యక్రమం ఎస్‌టీయూ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు కొనకంచి వీరరాఘవులు, తండు భానుప్రకాశ్ గౌడ్, నాయకులు రమేశ్, వీరాంజనేయులు, ఉదయరాణ, జాన్‌ఖాన్, ప్రమీల పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మిర్యాలగూడ, జనవరి 12: మండలంలోని తక్కెళ్లపాడు నుంచి అశోక్ లేలాండ్ వాహనంలో ఆంధ్రా ప్రాంతానికి తరలిస్తున్న 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ఆదివారం వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. వాహనంలో 80 బస్తాల్లో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండడంతో పట్టుకున్నట్లు ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపారు. వాహనం డ్రైవర్ మచ్చ రవిని అదుపులోకి తీసుకొని విచారించగా పోతినేని శ్రీనివాస్‌రావు బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దేవరకొండలో..

చందంపేట(దేవరకొండ), జనవరి 12 : దేవరకొండ మీదుగా నాగర్‌కర్నూల్ జిల్లాకు తరలిస్తున్న 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ఆదివారం దేవరకొండ పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు డీటీసీఎస్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మర్రిగూడ, జనవరి 12 : మండలంలోని కమ్మగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని బోజ్యాతండాలో నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. తండాకు చెందిన సభావత్ సునీల్‌కు చెందిన ఇంట్లో నిల్వ ఉంచిన 90 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.కృష్ణారెడ్డి తెలిపారు.


పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు

బీఆర్‌ఎస్ నాయకుడికి కిషన్‌రెడ్డి పరామర్శ

సూరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కిషన్‌రెడ్డి

శాలిగౌరారం, జనవరి12 : బీఆర్‌ఎస్ తిరుమలరాయినిగూడెం గ్రామ శాఖ అధ్యక్షుడు కర్రె సైదులు తాత సూరయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి ఆదివారం గ్రామానికి వెళ్లి సూరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ వడ్లకొండ భిక్షం, వాడపల్లి జగన్, కూరం వెంకన్న ఉన్నారు.

బెల్లి యాదయ్యకు అలిశెట్టి ప్రభాకర్ స్మారక అవార్డు

బెల్లి యాదయ్యకు అవార్డు అందిస్తున్న అల్లం నారాయణ

రామగిరి/నకిరేకల్, జనవరి 12: ప్రముఖ కవి, రచయిత, అధ్యాపకుడు డాక్టర్ బెల్లి యాదయ్యకు అలిశెట్టి ప్రభాకర్ పురస్కారం లభించింది. ఆదివారం కరీంనగర్‌లోని ఫిలింభవన్‌లో నిర్వహించిన అలిశెట్టి స్మారక రాష్ట్ర స్థాయి పురస్కార సభలో ప్రెస్ అకాడమి మాజీ అధ్యక్షుడు అల్లం నారాయణ చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, అలిశెట్టి పురస్కార కమిటీ సభ్యులు గాజోజు నాగభూషణం, కూకట్ల తిరుపతి, అన్నవరం దేవేందర్, బూర్ల వెంకటేశ్వర్లు, సీవీకుమార్, కందుకూరి అంజయ్య, ప్రజాగాయకుడు చింతల యాదగిరి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ ట్రాక్టర్ బోల్తా.. కార్మికుడి మృతి

మాడ్గులపల్లి, జనవరి 12: అదుపుతప్పి గ్రామపంచాయతీ ట్రాక్టర్ బోల్తా పడగా.. మల్టీ పర్పస్ వర్కర్ మృతి చెందిన ఘటన మండలంలోని ఆగామోత్కూర్ ఆవాస గ్రామం చిన్నగూడెంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన గంజి పాపయ్య (40) నామా ఆదామ్ గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ద్వారా చిన్నగూడెం గ్రామంలో నీటిని సరఫరా చేసేందుకు ఆదివారం ఉదయం వెళ్లారు. తిరిగి ఆగామోత్కూర్‌కు వస్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. దాంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో పోలీసులకు అక్కడికి వెళ్లి జేసీబీ సాయంతో ట్రాక్టర్‌ను సరిచేసి దాని కింద ఇరుక్కున్న పాపయ్య, ఆదామ్‌ను మిర్యాలగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించి వైద్యులు పాపయ్య అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. గాయపడిన ఆదామ్‌కు చికిత్స అందిస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. పంచాయతీ కార్యదర్శి నాగేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

మిర్యాలగూడ, జనవరి 12: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలోని చిల్లాపురం గ్రామంలో ఆదివారం రైస్ మిల్లర్, చిల్లాపురం గ్రామ రామాలయ కమిటీ చైర్మన్ సాతునూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో క్రీడాకారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు మల్లికంటి అనూషా రేణుబాబు, కంచనపల్లి రమణాశ్రీనివాస్, నాయకులు జాజుల నాగయ్య, మల్లికంటి అంజయ్య, లక్ష్మీనారాయణ, రాయవరపు రాంబాబు, మోత్కూరి సైదాచారి, అనుముల సతీశ్, కోట్ల శ్రీనివాస్‌రెడ్డి, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు లక్ష్మీనారాయణ

మాట్లాడుతున్న చిన్నపాక లక్ష్మీనారాయణ

నిడమనూరు, జనవరి 12 : బూటకపు హామీలతో గద్దెనెక్కి ప్రజలను వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చిన్నపాక లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీనుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ప్రభుత్వం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మినహా మరే పథకాన్ని అమలు చేయలేదన్నారు. అర్హులైన రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పార్టీ మండల కార్యదర్శి కందుకూరి కోటేశ్, నాయకులు కొమాండ్ల గుర్వయ్య, బాలనారాయణ, ముత్యాల కేశవులు ఉన్నారు.

దాడులను సంఘటితంగా ఎదుర్కోవాలి

- న్యాయవాది నర్సింహ

సమావేశంలో మాట్లాడుతున్న దర్శనం నర్సింహ

రామగిరి, జనవరి 12: ప్రజా స్వామ్య శక్తులు విసిరే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక కొంత మంది ఉన్మాదపు దాడులకు తెగిస్తున్నారని, ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారత దేశంలో మతం పేరుతో మానవ హననం జరుగుతుందని ప్రముఖ న్యాయవాది దర్శనం నర్సింహ అన్నారు. నల్లగొండలోని స్వాతంత్ర్య సమర యోధుల భవనంలో ఆదివారం 'భావ స్వేచ్ఛ విద్వేషపు దాడులు' అంశంపై ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజ్యాంగ లౌకిక భావజాలాన్ని కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పన్నాల గోపాల్‌రెడ్డి, పందుల సైదులు, కె.పర్వతాలు, కె.అనంతరెడ్డి, అక్కెనపల్లి వీరస్వామి, చింతమల్ల గురువయ్య, ఇందూరి సాగర్, అలెగ్జాండర్, సీహెచ్.సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : జూనియర్ కళాశాల మైదానంలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, జనవరి 12: యువత క్రీడల్లో రాణించి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్‌వీఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌వీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నూకల వేణుగోపాల్‌రెడ్డి, నిర్వాహకులు అశోక్‌నాయక్, కౌన్సిలర్లు నర్సిరెడ్డి, రవినాయక్, వెంకన్న, మాజీ ఎంపీటీసీ బెజ్జం సాయి, పీపీ శ్రీధర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

బంజారా ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ

బంజారా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించి డైరీ, క్యాలెండర్‌ను ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథనాయక్, ఎంపీడీఓ శంకర్ నాయక్, నాయకులు లాలూనాయక్, కోట్యానాయక్, అరుణ, బద్దు, రమేశ్‌నాయక్, సేవాలాల్, మాత్యనాయక్, హమీద్, అస్లాం పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా హ్యాండ్‌బాల్ శిక్షణ శిబిరం


క్రీడాకారులతో హెచ్‌ఎం, మాజీ ఎంపీటీసీ; ఉపాధ్యాయులు

కట్టంగూర్, జనవరి 12 : మండలంలోని చెర్వుఅన్నారం ఉన్నత పాఠశాలలో పది రోజులుగా నిర్వహిస్తున్న జూనియర్ బాలుర హ్యాండ్ బాల్ శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కందాల రమ, మాజీ ఎంపీటీసీ ఎడ్ల పెదరాములు క్రీడాకారులకు పండ్లు పంపిణీ చేశారు. క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి జిల్లాను ప్రథమ స్థానంలో నిలుపాలని సూచించారు. కార్యక్రమంలో చౌగోని రవి, ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెరిక కులస్తుల అభివృద్ధికి తోడ్పాటు అందించాలి

దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య


నిడమనూరు మార్కెట్‌కమిటీ చైర్మన్ అంకతి సత్యంను సన్మానిస్తున్న పెరిక సంఘం నాయకులు

నల్లగొండ రూరల్/నిడమనూరు, జనవరి12: పెరిక కులస్తులు రాజకీయంగా ఎదిగేందుకు ప్రతిఒక్కరూ తోడ్పాటు అందించాలని, ప్రభుత్వ పరంగా పెరిక కార్పొరేషన్‌కు తోడ్పాటు అందిస్తున్నదని దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పెరిక విద్యార్థి వసతి గృహంలో నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పెద్ద ఎత్తున పెరిక కులస్తుల పోటీ చేయాలని సూచించారు. అనంతరం అంకతి సత్యంను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెరిక కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దా లింగయ్య, రాష్ట్ర సీనియర్ నాయకులు జుట్టుకొండ సత్యనారాయణ, ప్రభాకర్, వలిశెట్టి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు ముత్తినేని శ్యామ్‌సుందర్, గౌరవాధ్యక్షుడు కోట మల్లిఖార్జున్‌రావు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

తిమ్మాయి పాలెంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ వీరశేఖర్

తిరుమలగిరి(సాగర్), జనవరి 12: మండలంలోని తిమ్మాయి పాలెం గ్రామంలో ఎంపాయిస్, యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఆదివారం ఎస్‌ఐ వీరశేఖర్ ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు శౌరీనాయక్, లాలూనాయక్, పాండునాయక్, మునినాయక్, బుజ్జినాయక్, బిచ్యాలునాయక్, సీతారాంనాయక్, బాలకృష్ణ, తులసీరాం, అర్జున్, నాగ పాల్గొన్నారు.

ప్రశాంతంగా టీసీసీ పరీక్షలు

రామగిరి, జనవరి 12: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ) లోయర్ అండ్ హయ్యర్ గ్రేడ్ డ్రాయింగ్ అండ్ టైలరింగ్, ఎంబ్రాయిడరీ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా కేంద్రంలోని 6 కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు 877 మంది హాజరు కావాల్సి ఉండగా 653 మంది హాజరైనట్లు జిల్లా పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ యూసుఫ్ వెల్లడించారు. పరీక్ష కేంద్రాలను డీఈఓ భిక్షపతి పరిశీలించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తిప్పర్తి : సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తిప్పర్తి, జనవరి 12 : మండలంలోని పజ్జూరు జడ్పీహెచ్‌ఎస్‌లో 1998–99 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు చదువు చెప్పిన ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాటి ప్రధానోపాధ్యాయుడు సోమేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు సుధాకర్‌రావు, ఆశీర్వాదం, సుందర దేశయణ, తాటికొండ సైదిరెడ్డి, నాగిరెడ్డి, కొప్పుల నర్సింహ, చిట్టిమల్ల అంజయ్య, రుద్రాక్షి రమేశ్, కులు, నసరుల్లాఖాన్, భిక్షంరెడ్డి, శ్యామ్ సునీషా, పూర్వ విద్యార్థులు మిర్యాల వెంకటపతి, కస్పరాజు రమేశ్, సుంకరి రాంబాబు, కొండూరు రమేశ్, రాగి మధు, ఏమిరెడ్డి జాన్‌రెడ్డి, కారె లక్ష్మీనారా సుంకరి సైదులు, గండమళ్ల వెంకన్న, కత్తుల కృష్ణయ్య, కళ్యాణి, టి.అన్నపూర్ణ, లావణ్య, శైలజ, జె. జానకమ్మ, డి.నాగమ్మ, కొల్లు జానకమ్మ, ఝాన్సీ పాల్గొన్నారు.

శాలిగౌరారం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–05 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

శాలిగౌరారం : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

'కష్టపడి చదివితే భవిష్యత్'

మిర్యాలగూడ, జనవరి 12: విద్యార్థులు కష్టపడి చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని మినా మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ మహమూద్‌అలీ అన్నారు. ఆదివారం కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసం కోసం కళాశాలలో చేరారని, దానిని పూర్తి చేసి మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. కళాశాలలో ర్యాగింగ్‌కు తావు లేదని అటువంటి సంఘటనలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ షహేలాబూతుల్, నలంద గ్రూప్ ఆఫ్ డైరెక్టర్ వాసిమ్, వాణి, వివిధ విభాగాల హెడ్స్, అధ్యాపకులు విద్యార్థినులు పాల్గొన్నారు.